క్లుప్తంగా

రోజా నామినేషన్‌కు తరలిన నేతలు

నిండ్ర: నగరి నియోజకవర్గంలో మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం నగరిలో నామినేషన్ కార్యక్రమానికి నిండ్ర మండలం నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఉదయం మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 2,500 మంది నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా పార్టీ కార్యదర్శి మేరి, సర్పంచ్‌లు బాబురెడ్డి, గౌరి, చంద్రబాబు, సంధ్య, ఎంపీటీసీ విజేష్, మునికృష్ణరెడ్డి, మునిరాజు, మహేష్, చెంచమ్మ, గోవిందమ్మ, వీరయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

పుత్తూరు: మండల పరిధిలోని గట్టు గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలతో పాటు, ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నుంచి పలువురు స్పెషలిస్టులచే వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గట్టు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎల్‌ఐసీ యూనియన్ నాయకులు

పుత్తూరు: స్థానిక ఎల్‌ఐసీ ఉద్యోగులు శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బ్రాంచి యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి ప్రారంభించారు. కార్యదర్శి లక్ష్మణకుమార్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ భాను, అధికారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నగరి: విద్యుత్ మెయింటనెన్స్ కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ వెంకటముని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



పనులను పరిశీలిస్తున్న పీడీ రాజశేఖర్

కార్వేటినగరం: ఉపాధిహామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పద్మసరస్సు, ఆర్కేవీబీపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కూలీలు ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు పనులు చేసేలా చూడాలని ఏపీఓ జ్యోత్స్నను ఆదేశించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అలాగే తాగునీరు కూడా అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. అనంతరం ఆయన ఉపాధి కూలీలతో ముచ్చటిస్తూ శ్రమకు తగిన కూలీ అందుతోందా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే వందమంది వరకు ఉపాధి పనులు చేయడం చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధిహామీ పనులు చేపట్టే చోట ఓఆర్ఎస్, ప్రథమ చికిత్సకు కావాల్సిన కిట్లు అందుబాటులో ఉంచారని కూలీలు పీడీకి విన్నవించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు పలువురు పాల్గొన్నారు.

ఉప్పొంగిన నగరి



మంత్రి రోజా నామినేషన్ సందర్భంగా నగరికి తరలివచ్చిన అశేష జనసందోహం

- అట్టహాసంగా మంత్రి ఆర్‌కే రోజా నామినేషన్
- నగరి గడ్డ మా రోజమ్మ అడ్డా అంటూ కదం తొక్కిన జనం
- దారులన్నీ నగరి వైపే.. స్వచ్ఛందంగా కదలివచ్చిన అభిమానులు
- మండుటెండను సైతం లెక్క చేయని అభిమాని దండు



నామినేషన్ వేసేందుకు వస్తున్న మంత్రి ఆర్‌కే రోజాకుఆపిల్ పండ్ల మాలతో స్వాగతం పలుకుతున్న నేతలు

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఆర్కే రోజా శుక్రవారం జనం.. జనం ప్రభంజనం అనే రీతిలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో నగరి పట్టణంలో పండుగ వాతావరణం కనిపించింది. నామినేషన్ పర్వానికి అన్ని మండలాలు, మున్సిపాలిటీల నుంచి జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. మంత్రి ఆర్కేరోజాతో పాటు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కొత్తపేట అగర వినాయక స్వామి ఆలయంలోను, తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయంలో నామినేషన్‌కు పూజలు చేసిన అనంతరం ఆమె అగర వినాయక స్వామి ఆలయం నుంచి నామినేషన్ వేయడానికి ఓపెన్‌టాప్ వాహనంలో ర్యాలీగా బయలుదేరారు. ''నగరి గడ్డ.. మా బిడ్డ రోజమ్మ'' అంటూ మద్దతు పలకడానికి అప్పటికే అక్కడికి తండోపతండాలుగా విచ్చేసిన జనం ఆమెతో పాటు అడుగులు కలిపారు. నగరి పట్టణం జనంతో ఉప్పొంగింది. దారులన్నీ జనంతో ర్యాలీ కొనసాగే మార్గం వైపే సాగింది. అడుగడుగునా జనం ఆమెకు ఆశీర్వచనాలు అందించారు. ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రి ముందుకుసాగారు. ర్యాలీ ప్రారంభం అయినప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయం చేరేవరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు. దారిపొడవునా కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనం అత్యధిక సంఖ్యలో ఉండడంతో ఆమె ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టింది. పార్టీ జెండాలు పట్టుకుని జై జగన్, జై రోజమ్మ అంటూ నినాదాల చేస్తూ ముందుకు నడిచారు. జన నగరి ఉప్పొంగితే ఇలా ఉంటుందా అనేలా నామినేషన్ వేడుకలు సాగాయి. జెండాలు జతకట్టినా ఇంతలా రానిజనం ఒక్క జెండాకే విచ్చేయడంతో నామినేషన్ అందరికీ 'విన్' అనే సంకేతాన్ని ఇచ్చింది.

శుభసూచకంగా... గంట కొట్టింది..

ర్యాలీ టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకోగానే మంత్రి ఆర్కేరోజా, బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మంత్రి ఆర్కేరోజా మాట్లాడేందుకు మైకు తీసుకోగానే టవర్‌క్లాక్ నుంచి గంట కొట్టడం యాదృచ్ఛికంగా జరిగింది. భగవంతుని ఆశీస్సులు ఆమెకు మెండుగా ఉందని విజయఢంకా మోగిందని జనం చర్చించుకున్నారు.

క్రేన్‌లతో గజమాలలు..

ర్యాలీగా నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన మంత్రి రోజాకు టవర్‌క్లాక్ సెంటర్‌లో క్రేన్ ద్వారా ఆపిల్‌తో చేసిన గజమాల, చావడి వద్ద నారింజ పండ్లతో చేసిన గజమాల వేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమంలో మంత్రి భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, సోదరులు కుమారస్వామి రెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు, నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్, మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీలు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం మంత్రి రోజా ఎన్నికల అధికారి వెంకటరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు.



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సాంస్కృతిక కార్యక్రమాలు



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న మంత్రి రోజా

అట్టహాసంగా కృపాలక్ష్మి నామినేషన్



ప్రచార రథం పైనుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి





ముస్లిం మతపెద్దల వద్ద ఆశీర్వచనం, మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- తరలివచ్చిన వేలాదిమంది కార్యకర్తలు
- జీడీనెల్లూరులో నామినేషన్ జాతర
- ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కృపాలక్ష్మి

కార్వేటినగరం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి నామినేషన్ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఏఎస్‌కొండ గ్రామం వద్ద వెలసిన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రచార వాహనం పైనుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి ఊరేగింపుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానంద రెడ్డి కూడా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇసుక వేస్తే రాలనంత జనం రావడంతో డిప్యూటీ సీఎం, కృపాలక్ష్మి అభివాదం చేస్తూ ర్యాలీగా జీడీనెల్లూరు మండల కేంద్రంలోని ఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ క్రమంలో భాగంగా ఎస్ఎస్ కొండ నుంచి బయలుదేరిన ర్యాలీ, చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి వరకు స్వచ్ఛందంగా తరలివచ్చిన కార్యకర్తలతో జనసంద్రంగా మారడంతో మండల కేంద్రంలో జాతర వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ అభిమానులు సీఎం జగన్ పాటకు స్టెప్పులు వేస్తూ ముందుకు సాగారు. దీంతో మండల కేంద్రం దద్దరిల్లిపోయింది. నామినేషన్ కార్యక్రమానికి ఆరు మండలాల నుంచి విచ్చేసిన జనానికి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి..

సీఎం జగనన్న ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న నా కుమార్తె కృపాలక్ష్మిని మీ బిడ్డగా ఆశీర్వదించాలని రానున్న శాసనసభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కోరారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ తన నామినేషన్‌కు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని, తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని తమ నామినేషన్ దాఖలు చేశారు.



నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేసేందుకు వస్తున్న జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నగరి: మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంవత్సరం పూర్తవుతున్న తరుణంలో పాఠశాల విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చాలా అట్టహాసంగా స్కూల్ వార్షికోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు పైతరగతులకు ప్రవేశిస్తున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో, విద్యావిషయక పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భువనేశ్వరి, ఉపాధ్యాయుడు నారాయణస్వామి, అంగన్‌వాడీ కార్యకర్త చిట్టెమ్మ, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి

పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని వైస్ ఎంపీపీ శేఖర్, మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ అన్బళగన్ తెలిపారు. శుక్రవారం జీడీ నెల్లూరులో ఎమ్మెల్యే అభ్యర్థిగా కృపాలక్ష్మి నామినేషన్ దాఖలకు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. జీడీనెల్లూరులో వైఎస్సార్‌సీపీని గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.



జీడీ నెల్లూరుకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వ్యవ'సాయం' చేసే పాలకులు కావాలి

''వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.. కర్షకుడికి తోడుగా నిలవాలి.. పంట విత్తు దగ్గర నుంచి ధాన్యం విక్రయం వరకు అండగా నిలబడాలికావాలి.. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి.. అన్నదాతలను అక్కున చేర్చుకోవాలి.. అలాంటి పాలకుడే కావాలి'' అంటున్నారు రైతన్నలు. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి నాయకుడిని ఎన్నుకుంటారని కదిలిస్తే వారి మాటల్లోనే..

–సాక్షి, నెట్‌వర్క్



పట్టించుకోని వారికి వేయను



అధికారం కోసం ఉచిత హామీలు ఇచ్చి, ఎన్నికల అనంతరం రైతులను పట్టించుకోని నాయకులకు మా రైతులను ఓటు అడిగే హక్కులేదు. రైతులకు కావాల్సిన విత్తనాలు, రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించి, పండించిన పంటకు గిట్టుబాటు కల్పించే పాలకులు రాష్ట్రానికి కావాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకునే వారికే మా ఓటు.

–ధనుంజయరెడ్డి, రైతు, సీఎం కండ్రిగ, పాలసముద్రం

మాయమాటలు చెప్పేవారు వద్దు..



ఓట్ల కోసం మాయమాటలు చెప్పి ఎన్నికల అనంతరం రైతులను పట్టించుకోని నాయకుడికి ప్రాణం పోయినా ఓటు వెయ్యం. పంటలు నష్టపోయిన కాలంలో రైతులకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకునే నాయకుడే మాకు కావాలి. రైతులను పట్టించుకోని నాయకుడు మరెవరినీ పట్టించుకోడు. కొందరు ఎన్నికలప్పుడు నోటికొచ్చిన హామీలు ఇచ్చి మోసం చేసిన రోజులు చూశాను.

– లోకనాథరెడ్డి, రైతు, అన్నూరు, కార్వేటినగరం

సుభిక్షంగా పాలించే వారికే..



కొందరు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో వర్షాలు పడక.. పంటలు చేతిక రాక కరువు తాండవిస్తుంది. గతంలో ఇలాంటి కష్టాలు ఎన్నో చూశాను. కొందరు అధికారంలోకి వచ్చిన వెంటనే వరుణుడు కరుణించి వర్షాలు పడి పంటలు పండుతాయి. రైతులు సంతోషంగా ఉంటారు. ప్రతి రైతు కోరుకునేది అలాంటి నాయకున్నే. ఉచిత హామీలు ఇచ్చి మోసం చేసే వారికి కాదు.

–మురగయ్య, రైతు,గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం

ద్రోహులు వద్దు..



గతంలో కొందరూ రైతులను, వ్యవసాయాన్ని గాలికి వదిలేశారు. పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాగ్దానం చేసి మోసం చేశారు. ఉచిత విద్యుత్ సరఫరాలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అలాంటి నాయకులు వద్దు. పంట వేసినప్పటి నుంచి విక్రయించే వరకు అండగా నిలిచే నాయకులు కావాలి. వారికే మా ఓటు కూడా.

– పి.పెద్దబ్బరెడ్డి, జక్కిదొన, వెదురుకుప్పం

అన్నదాతను ఆదరించే వారికే ఓటు



దేశానికి వెన్నెముక అయిన అన్నదాతను ఆదరించే వారికే నాఓటు వేస్తా. రైతన్నలు పంటలు పండిస్తేనే అందరికీ నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లేది. ఈ విషయాన్ని గుర్తించి రైతుకు అండగా నిలిచే ప్రభుత్వం రావాలి. హామీలు ఇచ్చి ఆపై మాట తప్పేవారు మాకు అవసరం లేదు. అలాంటి వారినే రైతు అయినా, కూలీ అయినా, కార్మికుడైనా కోరుకునేది.

–ఎస్.పెరుమాల్‌రెడ్డి, తిమ్మాపురం, పుత్తూరు మండలం

రైతు పక్షపాతికే ఓటు..



రైతులకు అండగా ఉంటూ రైతు సంక్షేమాన్ని కోరుకుని, అన్ని సౌకర్యాలు కల్పించే వారికే ఓటు వేస్తాం. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం హామీలు ఇచ్చి, తరువాత పట్టించుకోని వారికి ఓటు వేయను. ఉచిత హామీలకు ఆశపడి ఈ ఎన్నికల్లో మోసపోను. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే వారికి, సాగుకు రుణసౌకర్యం కల్పించి రైతు పక్షపాతిగా నిలిచే వారికే నా ఓటు.

–రాధయ్య, రైతు, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం

రైతు బాగుంటేనే..



రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించే ప్రభుత్వాలు రైతు క్షేమం కోరి పథకాలు ప్రవేశపెట్టి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. అలాంటి ప్రభుత్వానికి నేను ఓటు వేస్తా. రైతుకు విత్తనం నుంచి ఎరువులతో పాటు పెట్టుబడి సాయం అందించే ప్రభుత్వం రావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. నేనే కాదు ప్రతి రైతు ఈ అభిప్రాయంతోనే ఉన్నాడు.

–వి.శంకరయ్య, కొత్తతిమ్మాపురం, పుత్తూరు మండలం

భరోసా ఇచ్చే నాయకుడు కావాలి



రైతులకు ఎన్ని కష్టాలు వచ్చినా నేనున్నాను అని గట్టి భరోసా ఇచ్చే నాయకుడు కావాలి. ఓట్ల కోసం ఉచిత హామీలు ఇచ్చి మొహం చాటేసే వారు నాయకుడు కాదు. రైతే రాజుగా గుర్తించే వారే నిజమైన నాయకుడు. రైతులను పట్టించుకోని వారికి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారం అవుతుంది. సాగుకు ముందుగా ఆర్థికసాయం అందించే పాలకులకే ఓటు వేస్తా.

–సుందరరాజు, రైతు రాచపాళ్యం, పాలసముద్రం

సంక్షేమ పాలకుడికే వేస్తా..



రైతుల సంక్షేమం గురించి ఆలోచించే వారికే మా ఓటు వేస్తాం. సంక్షేమ పథకాలతో పాటు రుణాలు అందించి, పంట నష్టపోతే పరిహారం అందించి అన్నదాతలను ఆదుకునే వారు కావాలి. అలాంటి పాలకులు ఉంటేనే మాలాంటి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అందుకే ఈసారి నా ఓటు సంక్షేమ పాలకుడికి వేస్తా.

– రవినాయుడు, గంగమాంబపురం, విజయపురం

రైతుకు అండగా నిలవాలి



రైతులకు అండగా ఉండే ప్రభుత్వం రావాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. రైతుల కోసం మంచి పథకాలు అమలు చేయాలి. కొందరు మాటలు చెప్పడంతో సరిపోతుంది. కానీ రైతులను ఆదుకోవాలి. అలాంటి నాయకుడి వెంట రైతులు ఉండాల్సిన అవసరం ఉంది.

– రమేష్, రైతు, నింద్ర

కష్టాలు తెలుసుకునే వాళ్లు కావాలి..



రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకుని ఆదుకోవాలి. అలాంటి ప్రభుత్వం కావాలి. అప్పుడే రైతులు బాగుంటారు. రైతులకు మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందించి ఆదుకునే పాలకులు కావాలి. వారికే మా ఓటు.

– లింగరాజు, మిట్టూరు, నింద్ర మండలం

మేము సుభిక్షంగా ఉండాలంటే..



రైతులు సుభిక్షంగా ఉండాలంటే వర్షాలు బాగా పడాలి. ఏడాదికి మూడు పంటలు సాగు చేసుకుంటాం. గతంలో వర్షాలు రాక పంటలు మా రైతుల గురించి పట్టించుకోలేదు. తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అప్పుల పాలయ్యాం. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అన్నదాతలకు అండగా ఉండే నాయకుడు కావాలి. వారికే ఓటు వేస్తాను.

– హరినాయుడు, కేవీపురం